సాక్షి రంగారెడ్డి
బుధవారం, 25, జూన్, 2025



పశువుల సంతకు..

మాల్ పశువుల సంతకు సొంత స్థలం గ్రహణం వీడనుంది. ప్రభుత్వం నాలుగు ఎకరాలు కేటాయించేందుకు నిర్ణయించింది 8లో ▸



విద్యార్థులకు టీసీ

సరూర్‌నగర్‌లోని వీఎం హోం నుంచి 165 మంది విద్యార్థుల తొలగింపునకు సిబ్బంది చర్యలు చేపట్టారు. 8లో ▸



ప్రాణం నిలిపారు

ఆమనగల్లు పట్టణ సమీపంలోని సురసముద్రం చెరువులో దూకిన యువకుడిని పోలీసులు కాపాడారు. 8లో ▸

న్యూస్‌రీల్

మైసిగండి ఆలయానికి భారీగా ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానం, ఆలయాల ప్రాంగణాల్లో వాహన పూజ రసీదు వసూలు, కొబ్బరికాయల విక్రయ హక్కులకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. మైసిగండి మైసమ్మ దేవత ఆలయ ప్రాంగణం లో దేవాదాయ శాఖ అధికారులు ముందుగా కొబ్బరికాయల విక్రయ హక్కులకు వేలం పాట నిర్వహించారు. వేలంలో నలుగురు పాల్గొనగా మైసిగండి గ్రామానికి చెందిన రామవత్ అమ్మనాయక్ అత్యధికంగా రూ.39,63,500తో కైవసం చేసుకున్నాడు. అనంతరం వాహనపూజ రసీదు వసూలు హక్కుకు నిర్వహించిన వేలంలో ముగ్గురు పాల్గొనగా మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ నాయక్ అత్యధికంగా రూ.13,31,000తో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు మోహన్‌రావు, ఈవో స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ బదిలీ అయ్యారు. అయన స్థానంలో కొత్త కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సుమారు రెండేళ్ల పాటు పనిచేసిన రవీంద్రసాగర్‌కు ఇంకా పోస్టింగ్ ఎక్కడా ఇవ్వకుండా వెయిటింగ్ జాబితాలో పెట్టారు.

చేవెళ్ల కమిషనర్‌గా వెంకటేశం బాధ్యతలు



చేవెళ్ల: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రస్తుత కమిషనర్ పూర్ణచందర్ కొత్త కమిషనర్‌కు బాధ్యతలు అప్పగించారు. పూర్ణచందర్‌ను రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త కమిషనర్ వెంకటేశం మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

మీర్‌పేట కార్పొరేషన్‌లో పదోన్నతులు

మీర్‌పేట: మున్సిపల్ శాఖలో మంగళవారం ప్రభుత్వం చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో మీర్‌పేట కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు అధికారులకు పదోన్నతి లభించింది. మేనేజర్‌గా ఇక్కడ పనిచేస్తున్న చంద్రప్రకాశ్ రెడ్డి పదోన్నతిపై మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా, రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్‌గా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై నియమితులయ్యారు.

నాలాల పరిశీలన



సర్వే చేస్తున్న అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని మాసబ్ చెరువు, దిలావర్‌ఖాన్ చెరువుల నాలాలను హైడ్రా అధికారుల బృందం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పలు చోట్ల నాలాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించింది. త్వరలో ఆక్రమణలను తొలగించి, భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సులువుగా ప్రవహించేలా చర్యలు చేపట్టనున్నామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్, ఇరిగేషన్ ఏఈ వంశీ, మండల సర్వేయర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: కొత్తగూడ రైతు వేదిక నుంచి విజయోత్సవ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు

భరోసా వచ్చే.. సంబురాలు తెచ్చె

రైతు భరోసా నిధుల పంపిణీ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సంబురాలు నిర్వహించింది. మంగళవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన విజయోత్సవ సభను జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి వీక్షించారు. కందుకూరు మండలం కొత్తగూడ రైతు వేదిక నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం చూశారు. ఆయా కూడళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.



మొయినాబాద్: సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

జాడలేని వరుణుడు

వానాకాలం సీజన్‌కుముందు రైతులను మురిపించిన వర్షాలు ఆ తరువాత ముఖం చాటేశాయి. రుతుపవనాలు ముందుగానే వచ్చాయని వాతావరణ శాఖ చెప్పడంతో ఈఏడాది వర్షాలు బాగానే ఉంటాయని ఆశించారు. వారి ఆశలు ఆవిరి అవుతున్నాయి. వరుణదేవుడి కరుణ కోసం అన్నదాతలు ఆకాశం కేసి ఎదురు చూస్తున్నారు.

- ముఖం చాటేసిన వర్షాలు
- ఆవిరవుతున్న రైతుల ఆశలు
- ముందే వేసిన విత్తుకు వాడిపోతున్న మొలకలు
- విత్తనాలు వేసేందుకు సిద్ధంగా మరికొందరు
- ఆకాశంకేసి ఆశగా ఎదురుచూపులు

ముందస్తుగా ఊరించి.. ఉసూరుమనిపించి..



చేవెళ్ల మండలం ఆలూరు సమీపంలో మొలక దశలోనే వాడిపోతున్న పత్తి

చేవెళ్ల: ఖరీఫ్ సీజన్‌లో రోహిణీ కార్తె ప్రారంభంలో జిల్లాలో ఒకటి రెండు వర్షాలు పడడంతో కొంత మంది పొలాలు చదును చేసి విత్తనాలు విత్తుకున్నారు. మరికొంత మంది విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేసి పెట్టుకున్నారు. తరువాత వారం పదిరోజులపాటు వానలు లేకపోవడంతో ఆందోళన చెందుతుండగా మృగశిర కార్తె ప్రారంభంలో మళ్లీ ఆశల్లజల్లు కురిసింది. దీంతో పొలాలను సిద్ధం చేసుకున్నవారు విత్తనాలు వేసుకున్నారు. మళ్లీ వర్షాలు లేకపోగా వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముందే వేసిన విత్తనాలకు పెరిగిన మొక్కల ప్రాణం నిలవాలన్నా, మొలకెత్తేందుకు భూమిలో ఉన్న విత్తనాలు జీవం పోసుకోవాలన్నా వర్షాలు కురవాలని చెబుతున్నారు. మొలకెత్తిన విత్తనాలు తడిలేక వాడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. భూమిలో విత్తనాలు వేసిన వారు మొలకెత్తకుండానే పోతుండటంతో దిగాలు చెందుతున్నారు. వర్షాలు పడకపోతే రూ.లక్షల్లో పెట్టిన పెట్టుబడులు మట్టిపాలు కావాల్సిందేనని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

అంతా అగమ్యగోచరం

ఈ వానాకాలంలో జిల్లాలో 3.47 లక్షల ఎకరాల్లో పంటలసాగు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 60 శాతానికి పైగా రైతులు తొలకరి వర్షాలకు విత్తనాలు వేసుకున్నారు. కార్తె దాటిపోతున్నా తిరిగి వర్షాల జాడలేకపోవడంతో ఇప్పుడు వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎక్కువగా పత్తిసాగువైపు దృష్టి సారించారు. సగానికిపైగా రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పొలాల్లో వేసుకొని వానలకోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 725.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉంది.

పెట్టుబడి నష్టపోవాల్సిందే



వానాకాలం ముందుగానే వచ్చిందని మురిసిపోయాం. రోహిణి కార్తెలోనే వర్షాలు పడడంతో విత్తనాలు, ఎరువులు తెచ్చి సిద్ధం చేసుకున్నా. మృగశిర కార్తె ప్రారంభంలో పడిన వర్షానికి మొక్కజొన్న, పత్తి విత్తనాలు వేశా. వారం పదిరోజులుగా వర్షాల జాడే లేదు. మొలకెత్తిన మొక్కలు వాడిపోతున్నాయి. వర్షం పడకపోతే పెట్టిన వేల రూపాయల పెట్టుబడి నష్టపోవాల్సిందే.

– శ్రీశైలం, రైతు, రామన్నగూడ

మొలకలు వాడిపోతున్నాయి



వేసవిలో వర్షాలు దంచి కొట్టాయి. వానాకాలంలో వేసవిలా ఎండలు మండిపోతున్నాయి. ఇలా అయితే ఖరీఫ్ సాగు కష్టమే. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నా వరుణదేవుడు కరుణ చూపించడం లేదు. ఉన్న మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మొలక దశలో పంట ఉంది. వర్షం పడితేనే అవి బతుకుతాయి. లేదంటే అన్నీ వాడిపోయే ప్రమాదం ఉంది.

– నర్సింలు, రైతు, ఆలూరు

వర్షాధార పంటలే అధికం



ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా వర్షాధార పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న తదతర పంటలు సాగు చేస్తుంటారు. 70శాతం వరకు రైతులు తొలకరి వర్షాలకు సాగుబాట పట్టారు. వర్షాలు లేకపోవడం కొంత ఇబ్బందిగానే ఉంది. ఒక వర్షంపడితే విత్తనాలు వేసిన రైతులకు మేలు జరగనుంది. మిగిలిపోయిన వారు కూడా విత్తనాలు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– శంకర్‌లాల్, ఏఓ, చేవెళ్ల



పార్టీ నేతలతో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఏం చేశారని సంబరాలు?

- కాంగ్రెస్ నేతలు కొత్తగా చేసిందేమిటో చెప్పాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతులను మోసం చేసి సంబురాలు చేసుకుంటారా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో రైతు నాయకులు, పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు కొత్తగా చేసిందేమిటో కాంగ్రెస్ నేతలు చెప్పి సంబురాలు జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ఎన్నికలప్పుడు నోటికొచ్చినట్లు హామీలు గుప్పించి ప్రజలు, రైతులను పక్కదారి పట్టించి అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. గత ఏడాది వానాకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగికి నాలుగు ఎకరాలకే పరిమితం చేశారని.. ఇప్పుడే ఏం ముఖం పెట్టుకొని పండుగ చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఎకరాకు రూ.ఏడున్నర వేల చొప్పున మూడు పంటలకు ఇస్తామని చెప్పి, ఒక్క పంటకు కూడా సరిగా రూ.ఆరు వేలు ఇవ్వలేదని అన్నారు. సన్నవడ్లకు క్వింటాలుకు ఇస్తామన్న రూ. 500 బోనస్ రైతులందరికీ ఇవ్వలేదని, రూ.2 లక్షల రుణమాఫీ సగం మందికి ఎగనామం పెట్టారని దుయ్యబట్టారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల రైతు బీమాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. రైతుల గురించి మాట్లాడే హక్కు, అర్హత ఆ పార్టీ నేతలకు లేదన్నారు. ఔటర్ రింగు రోడ్డు చుట్టూ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తిరగబడితే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. దీంతో బుధవారం ఇబ్రహీంపట్నంలో చేపట్టాల్సిన రైతు మహాధర్నాను వాయిదా వేశామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

కొత్తూరు: త్వరలో నిర్వహించనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. మండలంలోని జేపీదర్గాలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల మహాసభకు హాజరైన ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతులతో పాటు అసంఘటిత రంగాల్లో పని చే స్తున్న వారి శ్రేయస్సు కోసం పార్టీ ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేసిందని గుర్తు చేశారు. అనంతరం కొత్తూరు, నందిగామ మండలాల నూతన కమిటీ కార్యవర్గాలను ఎన్నుకున్నారు.



సభలో మాట్లాడుతున్న జంగయ్య

కొత్తూరు మండల కార్యదర్శిగా ఎండీ షకీల్, సహాయ కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి, నందిగామ మండల కార్యదర్శిగా గడ్డం జంగయ్య, సహాయ కార్యదర్శిగా రాఘవేందర్‌తో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మంజుల, సక్రు నాయక్, సంజీవకుమార్, తాహేర్ పాల్గొన్నారు.



కన్న కూతురే.. కర్కశంగా మారే..

ప్రియుడితో తల్లిని చంపించిన పదో తరగతి బాలిక

- తమ ప్రేమకు అడ్డుగా ఉందని ఘాతుకం
- ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడితో కలిసి దారుణం
- జీడిమెట్ల పరిధిలో కలకలం రేపిన ఘటన

జీడిమెట్ల: 'నువ్వు వచ్చి మా అమ్మను చంపు.. లేదంటే నీ పేరు రాసి నేను ఆత్మహత్య చేసుకుంటా'నంటూ ప్రియుడిని బెదిరించిన పదో తరగతి బాలిక.. కన్నతల్లినే హత్య చేయించిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం కలకలం రేపింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన నట్ల అంజలి(39)కి 16 ఏళ్ల క్రితం దమ్మన్నపేటకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. వీరికి కూతురు (15) ఉంది. 13 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో అంజలి కుప్పంకు చెందిన రవి అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. వారికి మనస్విని (12) అనే కూతురు జన్మించింది. రవి సైతం గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంజలి కొన్నేళ్లుగా తెలంగాణ సాంస్కృతిక సారథి విభాగంలో కళాకారిణిగా పని చేస్తూ.. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి మూడు నెలలుగా షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. షాపూర్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పెద్ద కుమార్తె 10వ తరగతి, చిన్న కూతురు 8వ తరగతి చదువుతున్నారు.



హతురాలు అంజలి (ఫైల్)



నిందితుడు శివ

ఇన్‌స్టాలో పరిచయంతో..

అంజలి పెద్ద కుమార్తె (15)కు నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన శివ (18)కు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ప్రేమకు దారితీసింది. 8 నెలలుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పింది. ఇద్దరి సామాజిక వర్గం ఒకటే కావడంతో అంజలి తొలుత అంగీకరించి.. ఆ తర్వాత వద్దని వారించింది. తమ ప్రేమకు తల్లి ఒప్పుకోకపోవడంతో బాలిక ఈ నెల 19న శివతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అదేరోజు అంజలి తన కూతురు కనిపించడం లేదంటూ శివపై అనుమానం వ్యక్తం చేస్తూ జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు అమ్మాయిని తీసుకుని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో ఈ నెల 21న శివతో పాటు బాలిక పీఎస్‌కు వచ్చారు. బాలికను తల్లితో ఇంటికి పంపించారు.



తల్లి మృతదేహంపై పడి రోదిస్తున్న చిన్నకుమార్తె మనస్విని

ప్రేమకు నిరాకరించిందని..

ఇంటికి వెళ్లిన తర్వాత శివను వదిలేసి చదువుపై దృష్టి పెట్టాలని కూతురును అంజలి బెదిరించింది. శివపై కేసు పెట్టించి జైలుకు పంపిస్తానంటూ కొట్టింది. తమ ప్రేమకు అడ్డొస్తోందనే కసితో తల్లిపై కోపం పెంచుకున్న బాలిక ఆమెను చంపాలని గట్టిగా నిర్ణయించుకుంది. తాను అనుకున్నట్లుగానే తన తల్లిని హైదరాబాద్ వచ్చి చంపాలని శివను కోరింది. చంపకపోతే నీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని శివను బెదిరించింది. దీంతో యువకుడు ఒప్పుకోవడంతో.. బాలిక తన చెల్లెలిని మరో ఇంటికి పంపించింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు శివ, తన తమ్ముడిని (16) తీసుకుని షాపూర్‌నగర్ వచ్చాడు. వచ్చీ రావడంతోనే కుర్చీలో కూర్చున్న అంజలిని ఒక్కసారిగా తోయడంతో ఆమె ముందుకు పడి తలకు గాయమైంది. వెంటనే అంజలి మెడకు గట్టిగా చున్నీ బిగించడంతో ఆమె కొట్టుకోసాగింది. శివ సోదరుడు అంజలి చేతులు పట్టుకోగా శివ చున్నీతో మెడకు గట్టిగా అదిమి పట్టుకున్నాడు. అంజలి ముక్కులోంచి తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయిందని నిర్ధారించుకున్నారు. తన తల్లి కిందపడి తలకు దెబ్బతగలంతో చనిపోయిందని అందరినీ నమ్మించాలని బాలిక పథకం పన్ని, శివను, అతని సోదరుడిని పంపించేసింది.

అంజలి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కాదు

మృతురాలు అంజలి చాకలి ఐలమ్మకు దూరపు బంధువే తప్పా మునిమనవరాలు కాదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై మీడియాలో వస్తున్న వార్తలు నిజం కావన్నారు.

బతికే ఉందని.. మళ్లీ రప్పించి..

కొద్దిసేపటి తర్వాత అంజలి మెల్లగా కదలసాగింది. అప్పటికే చిన్న కుమార్తె మనస్విని ఇంటికి రాగా.. అమ్మ ఇంట్లోకి రావొద్దని చెప్పిందంటూ సోదరిని బాలిక బయటే కూర్చోబెట్టింది. 108కు కాల్ చేసినట్లు నటిస్తూ విషయాన్ని ప్రియుడు శివతో మాట్లాడింది. తన తల్లి ఇంకా బతికే ఉందని చెప్పింది. నల్లగొండ వెళ్లేందుకు ఎల్‌బీనగర్‌లో ఉన్న శివ మళ్లీ తన సోదరుడిని తీసుకుని రాత్రి 7.30 గంటలకు షాపూర్‌నగర్ వచ్చాడు. 'ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. నిన్ను కాపాడతాను ఆంటీ' బాలిక మనస్విని ముందు నటించాడు. వేరే ఆంటీని పిలుచుకు రావాలంటూ ఆమెను ఇంట్లోంచి పంపించారు. తిరిగి అంజలి మెడకు చున్నీ బిగించారు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటలకు తన తల్లి చనిపోయిందని పెద్ద కుమార్తె బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. రాత్రి 11 గంటల తర్వాత జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌కు విషయం తెలిసింది. ఈ నెల 19న బాలిక అదృశ్యమైన కేసు జీడిమెట్లలో నమోదు కావడంతో ఇది కచ్చితంగా హత్యేనని నిర్ధారణకు వచ్చారు. వెంటనే రెండు బృందాలను రంగంలోకి దింపి శివను కట్టంగూరులో అదుపులోకి తీసుకున్నారు. అతడి సోదరుడు (15)ను హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులను విచారణ చేయగా.. అంజలిని తామే చంపివేశామని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తన తల్లిని పూర్తిగా చంపే వరకు ఇంటి బయటే కాపలా కాసిందని, తల్లి మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా 'క్షమించు మమ్మీ' అంటూ నిందితురాలు బాలిక రోదించిందని స్థానికులు తెలిపారు. అంజలి మృతదేహాన్ని స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

వీఎం హోంలో 165 మంది విద్యార్థులకు టీసీ


వీఎంహోం ఎదుట ఆందోళన చేపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- అనాథలకు మాత్రమే అడ్మిషన్లు ఇస్తామని స్పష్టీకరణ
- తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగిన విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సుమారు 165 మంది విద్యార్థులను తొలగించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంది. ఇందులో ఇప్పటికే కొందరు విద్యార్థులకు టీసీ, బోనఫైడ్‌లు సైతం ఇచ్చి పంపించారు. దీంతో కొన్నేళ్లుగా చదువుకుంటున్న తమను అర్ధాంతరంగా వెళ్లిపొమ్మంటే ఎక్కడికి వెళతామంటూ బాధిత విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి మంగళవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాలు.. సరూర్‌నగర్‌లోని వీఎంహోం రెసిడెన్షియల్ పాఠశాల కేవలం తల్లిదండ్రులు లేని, తల్లిగాని, తండ్రిగాని లేని అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందించే కేంద్రం. ఇక్కడ సుమారు 900 మంది అనాథ విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తుంటారు. ఇందులో కేవలం అనాథ విద్యార్థులకే సీటు కేటాయించి విద్యనందించాలి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉన్న పిల్లలకు తాము నిరుపేద వారమంటూ వచ్చిన వారికి గతంలో సీటు ఇచ్చామని.. ఈ కారణంగా అనాథలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు ఉన్న విద్యార్థులకు టీసీ, బోనఫైడ్‌లు ఇచ్చి వారు కోరుకున్న రెసిడెన్షియల్ పాఠశాలలకు అక్కడి సిబ్బందితో మాట్లాడి బదిలీ చేస్తామని హోం పాఠశాల నిర్వాహకులు తెలిపారు. తమ సూచన మేరకు కొందరు తల్లిదండ్రులు సుముఖంగా తిరిగి వెళ్తున్నప్పటికీ మరికొందరు ఇతరులతో కలిసి ఆందోళన చేయడం బాధాకరమని, వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

పిల్లలను రోడ్డుపైకి లాగొద్దు

నా కూతురు ధనలక్ష్మి 1 నుంచి 8వ తరగతి వరకు వీఎంహోంలో విద్యనభ్యసిస్తూ వస్తోంది. రెండేళ్లలో తన పదో తరగతి పూర్తి చేసుకోబోతుంది. అలాంటి ఇప్పుడు ఉన్నపలంగా నా కూతురుకు టీసీ ఇచ్చి వేరే ఎక్కడికో బదిలీ చేస్తామంటే ఆమె జీవితం రోడ్డున పడాల్సి వస్తోంది. కఠిన నిర్ణయాలతో రోడ్డుపైకి లాగొద్దు.

– జటావత్ పవన్, విద్యార్థిని తండ్రి, దేవరకొండ

అసలు విద్యార్థులకు అన్యాయం జరగొద్దు

తల్లిదండ్రులు ఇద్దరూ ఉండి తప్పుడు పత్రాలతో దరఖాస్తు పొందిన విద్యార్థులను గుర్తించి టీసీ, బోనఫైడ్ అందించి వారు కోరుకున్న రెసిడెన్షియల్ పాఠశాలకు పంపిస్తున్నాం. తమ సూచనను కొందరు తల్లిదండ్రులు అర్థం చేసుకుని వెళ్తున్నప్పటికీ మరికొందరు మాత్రం ఇతరుల ప్రోద్బలంతో ఆందోళనకు దిగుతున్నారు. ఇది సరికాదు. వీరి కారణంగా 900 వరకు ఉండాల్సిన విద్యార్థుల సామర్థ్యం మించిపోతుంది. కేవలం అసలైన అనాథ విద్యార్థులకు మాత్రమే వీఎంహోంలో ఉచిత విద్యను అందించడం జరుగుతుంది. దయచేసి తల్లిదండ్రులు సహకరించాలని కోరుతున్నాం.

– లక్ష్మీపార్వతి, సూపరింటెండెంట్, వీఎంహోం పాఠశాల, సరూర్‌నగర్

తండ్రి ఉన్నా పట్టించుకోడు..

2014 నుంచి వీఎంహోం పాఠశాలలో చేరాం. చెల్లెళ్లు ఏంజలినా జోలి, అజెంతాలతో కలిసి విద్యనభ్యసిస్తూ వస్తున్నాం. తండ్రి ఉన్నా పట్టించుకోకపోవడంతో తమ తల్లి సంరక్షణలో పెరుగుతున్నాం. మేము నిరుపేద కుటుంబంలో పుట్టిన ముగ్గురు అక్కాచెల్లెళ్లం. అర్ధాంతరంగా తమకు వీఎంహోం పాఠశాల నుంచి తొలగించడం బాధాకరంగా ఉంది.

– లావణ్య ప్రియ, 8వ తరగతి

భార్య మరణం తట్టుకోలేక..

పురుగు మందు తాగి భర్త బలవన్మరణం


రమేశ్(ఫైల్)

మొయినాబాద్: భార్య మరణం జీర్ణించుకోలేక మనస్థాపానికి గురైన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సాలె రమేశ్(35) కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య పుష్పలత అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో మనస్థాపానికి గురైన రమేశ్ ఈ నెల 22న ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో స్నానం చేసి ఇంట్లోకి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి నోట్లో నుంచి నురుగలుకక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతని పక్కనే ఓ సీసాలో పురుగు మందు ఉంది. వెంటనే ఆయన్ను స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేశ్ మంగళవారం మృతి చెందాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారని గ్రామస్తులు కంటతడిపెట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాము కాటుతో వలస కూలీ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: పాముకాటుతో వలస కూలీ మృతి చెందిన సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొంగరకలాన్‌లో ఐకేసీ టెలీకమ్యూనికేషన్ ఇన్‌ఫ్రాలో పనిచేసే కూలీ దొంతర తిరుమలయ్య (32) పడుకుని ఉండగా మెడ వద్ద పాము కరిచింది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రకాశం జిల్లాలోని జయరాంపూర్ ఇతని స్వగ్రామంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల సంతకు సర్కార్ భూమి

మాల్ పశువుల సంతకు సొంత స్థలం గ్రహణం వీడనుంది. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయించింది.

- మాల్ సర్వే నంబర్ 640లో నాలుగు ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే లేఖ
- సర్కార్ అంగీకారం
- సర్వే చేపట్టాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


మాల్ సర్వే నంబరు 640లోని ప్రభుత్వ భూమి

యాచారం: మాల్ పశువుల సంతకు సొంత స్థలం లేక ఇన్నాళ్లు ప్రైవేట్ వెంచర్లలో కొనసాగించారు. ఇక్కడ ప్రతీ మంగళవారం నిర్వహించే సంతకు జిల్లా పరిధిలోని యాచారం, కందుకూరు, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, మండలాలతో పాటు నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి, దేవరకొండ, నార్కాట్‌పల్లి మండలాల పరిధి గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యాపారులు పశువులు తీసుకువచ్చి క్ర య విక్రయాలు జరుపుతుంటారు. ఈ సంత నిర్వహణతో గ్రామ పంచాయతీకి ప్రతీ ఏట రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది. దీంతో ఆత్మ నిర్భర్ పంచాయతీ ప్రత్యేక అవార్డుల్లో (ఏఎస్‌పీఎస్‌ఏ) మాల్ గ్రామ పంచాయతీ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ప్రతీ ఏటా సంత ని ర్వహణ వేలం ద్వారా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

సర్కార్ అంగీకారం

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ పంచాయతీలో సర్వేనంబరు 640లో దాదాపు రూ.వంద కోట్ల విలువ చేసే 16–20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న గ్రామంలో పశువుల సంత ఏర్పాటుకు శాశ్వత స్థలం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేశారు. స్థానికుల డిమాండ్ మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంత ఏర్పాటుకు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇందుకు స్పందించిన సర్కార్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ సర్వే చేపట్టి హద్దుల ఏర్పాటు చేయనున్నారు.

మాంసం, చేపల విక్రయానికి మార్కెట్

పశువుల సంతకు శాశ్వత స్థలం ఉంటే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రైవేట్ వెంచర్లలో నిర్వహిస్తుండడంతో టెంట్లు, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాల కల్పనకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. వెంచర్ల యజమానులతో రైతులకు, వ్యాపారులకు వాగ్వాదం నిత్యకృత్యం. సంతకు కేటాయించే నాలుగు ఎకరాల్లో మాంసం, చేపల విక్రయానికి మార్కెట్ నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. విశాలమైన స్థలం ఉంటే పశువులతో పాటు గొర్రెలు, మేకలు, వ్యవసాయ పనిముట్లు విక్రయించుకునే అవకాశం ఉంటుంది.

ఎమ్మెల్యే కృషితోనే



మాల్ పశువుల సంతకు సర్వే నంబరు 640లో శాశ్వత స్థలం కేటాయించాలని గతంలో పలుమార్లు అధికారులు, కలెక్టర్లు, మంత్రులకు విన్నవించాం. స్పందించిన వారే లేరు. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో సంతకు నాలుగు ఎకరాల స్థలం కేటాయించడం సంతోషకరమైన విషయం. శాశ్వత స్థలముంటే సంత ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. – పి.కవిత, మాజీ సర్పంచ్, మాల్

సంత ఆదాయంతోనే అవార్డు



పశువుల సంత నిర్వహణ వల్ల ప్రతి ఏటా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయంతోనే మాల్ గ్రామ పంచాయతీకి ఏఎస్‌పీఎస్ఏ అవార్డు వరించింది. రాష్ట్రంలో ఈ అవార్డు పొందిన ఎకైక గ్రామం మాల్. శాశ్వత స్థలం ఉంటే మరింత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

– శ్రీలత, మండల పంచాయతీ అధికారి

కలెక్టర్ ఆదేశాలు అందాయి



మాల్‌లో సర్వే నంబరు 640లో పశువుల సంతకు నాలుగు ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే సర్వే చేపట్టి నాలుగు ఎకరాల స్థలానికి హద్దులు గుర్తించి, మ్యాప్ వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం. నాలుగు ఎకరాలతో పాటు మొత్తం 16–20 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు గుర్తిస్తాం. ఆక్రమణకు గురైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

చికిత్స పొందుతూ వివాహిత మృతి


మధు(ఫైల్)

ఆమనగల్లు: నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ ఉస్మానియా ఆస్పత్రిలో మంగళవారం మృతిచెందింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన గోపీకి తలకొండపల్లి మండలం గౌరిపల్లితండాకు చెందిన మధుతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్తింటివారు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన మధు గత సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను మొదట కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. ఈక్రమంలో మంగళవారం మధు మరణించింది. ఆమె తండ్రి దేవ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం


అశ్రిత్(ఫైల్)

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన కె.అశ్రిత్ చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం సోమవారం అశ్రిత్ పాఠశాలలో చేరాడు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రిన్సిపల్ దేవేందర్ మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నక్కగుట్టతండా సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

అధిక ధరలకు సిలిండర్ విక్రయాలు

ఎస్ఓటీ పోలీసుల దాడులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎక్కువ ధరలకు అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న వారిపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. బొంగ్లూర్‌లో ఆటోలో 39 సిలిండర్లను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద ఎలాంటి కాగితాలు లేకపోవడంతో అనుమానంతో మహేశ్వరం ఎస్ఓటీ, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి, సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్జెల మాణిక్యంరెడ్డి, సీతా మహేష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

అమెరికా వెళ్లొచ్చేసరికి బీరువా ఖాళీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంట్లో ఎవరూ లేర ని గుర్తించిన దుండగులు బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, ఐఫోన్, ఐపాడ్ ఎత్తుకెళ్లిన విషయమై ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తుర్కయంజాల్‌లో నివాసం ఉండే సోమరౌతు శ్రీలక్ష్మి గత ఏప్రిల్ 18న అమెరికా వెళ్లింది. రెండు నె లల తర్వాత జూన్ 19న ఇంటికి చేరుకుంది. ఈ మధ్య కాలంలో తన బీరువాలో దాచిన సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, ఐపాడ్, ఐఫోన్ చోరీకి చోరీకి గురయ్యాయని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, శ్రీలక్ష్మి కొడుకును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

స్పందించారు.. ప్రాణం నిలిపారు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని సురసముద్రం చెరువులో దూకిన యువకుడిని పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మంగళపల్లికి చెందిన దుర్గాపురం కొండల్ కుటుంబ సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని మంగళవారం చెరువులో దూకాడు. క్షణాల్లో స్పందించిన స్థానిక పోలీసులు మల్లయ్య, ఇబ్రహీం ఈతగాళ్ల సాయంతో కొండల్‌ను బయటకు తీసుకువచ్చారు. అనంతరం అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కొండల్‌తో మాట్లాడుతున్న పోలీసులు

తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్ల భరోసా

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

చేవెళ్ల: తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు కర్షకుల ఖాతాల్లో జమచేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల్లో భరోసా కల్పించిందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం అందిన సందర్భంగా మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. 1,49,39,111 మంది రైతులకు రైతు భరోసా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు గణేశ్‌గౌడ్, రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రత్నం, మత్స్యకార విభాగం జిల్లా చైర్మన్ మహేందర్ ముదిరాజ్, నాయకులు అశోక్‌యాదవ్, కేబుల్ రాజు, భిక్షపతి, కరణ్, రాజుగౌడ్, మినాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'భరోసా': కాంగ్రెస్

ఇబ్రహీంపట్నం: ఔటర్ రింగు రోడ్డును ఆనుకుని ఉన్న ఎనిమిది మండలాలకు చెందిన రైతులు ఆందోళన చెందవద్దని, అందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు భరోసా నిధుల విడుదలకు ఆదేశించారని తెలిపారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు

షాద్‌నగర్‌రూరల్: తప్పుడు డాక్యుమెంట్ల సృష్టించేందుకు భూత్పూర్ మీసేవ కేంద్రం వేదికయింది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో రూ.7 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు గ్రామానికి చెందిన కొత్తపల్లి సుభాన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలోని ఓ మీసేవ నిర్వాహకుడి కుమ్మక్కయ్యారు. బాధితుల సమాచారం మేరకు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుభాన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, నవనీత, దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మీ సేవ కేంద్రం నిర్వాహకులతో పాటుగా నలుగురు సాక్షులపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

లాడ్జిలో బ్యూటీషియన్ బలవన్మరణం

గచ్చిబౌలి: ఓయో లాడ్జిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం..నల్లగండ్లలో నివాసం ఉండె జి.అనూష(26) ఆన్‌లైన్ ఆర్డర్లపై బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. గత సంవత్సరం వివాహం జరగ్గా మనస్పర్థల కారణంగా విడిపోయారు. అప్పటి నుంచి అనూష తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు స్నేహితుల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఫోన్ చేసినా స్పందించలేదు. సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గచ్చిబౌలిలోని ఓ లాడ్జిలో అనూష ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు సమాచారం అందించారు. సీలింగ్ ఫ్యాన్‌కు కర్టన్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. సంతోష్ అనే వ్యక్తి మొదట సమాచారం అందించాడని, తన సోదరి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని సోదరుడు రాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ కథనం ప్రకారం..నేపాల్ పతంపుర గ్రామానికి చెందిన రిసాచౌదరి (21) ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఓ ఫామ్ విల్లా సమీపంలోని గదిలో గీతాచౌదరి అనే యువతితో కలిసి ఉంటోంది. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి అందరూ భోజనం చేసిన తరువాత నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం తెల్లవారుజామున గీతాచౌదరి లేచి చూసే సరికి పక్కనే పడుకున్న రిసాచౌదరి కనిపించలేదు. ఫోన్ అక్కడే పడేసి ఉంది. వెంటనే విల్లా యజమాని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రిసాచౌదరి కనిపించడంలేదని తెలిపింది. దీంతో చుట్టు పక్కల చూడగా విల్లా పైకి ఎక్కే రౌండ్ మెట్లు ఉన్న రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలు చనిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

బావిలో పడి బాలుడి గల్లంతు

మైలార్‌దేవ్‌పల్లి: అప్పటి వరకు ఇంట్లో సందడి చేసిన ఆ బాలుడు ఆడుకుంటూ బయటకు వెళ్లి..ఇంటి సమీపంలోని నీటి బావిలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన చంద్రకుమార్ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రిన్స్(5) మంగళవారం ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి బావి వద్దకు వెళ్లి అందులో పడిపోయాడు. స్నేహితుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు బావి వద్దకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. హైడ్రా, ఎన్డీఆర్‌ఎఫ్, అగ్ని మాపక సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రైనా బాలుడి ఆచూకీ లభించలేదు. ఉదయాన్నే తిరిగి గాలింపు చర్యలు ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.